క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధిపై ఎంపీ మాగుంట ప్రశ్న

ఒంగోలు: మైనార్టీ యువతకు నైపుణ్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పార్లమెంట్‌లో లేవనెత్తిన ప్రశ్నకు కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖామంత్రి స్మృతి ఇరానీ సమాధానమిచ్చారు. దేశంలో 6 ప్రకటిత మైనార్టీ తెగల 14–15 సంవత్సరాల వయసు గల యువతకు ఆధునిక సంప్రదాయ నైపుణ్యాల అభివృద్ధి కల్పనకు ప్రభుత్వం సీఖో ఔర్ కామో స్కీం (నేర్చుకోండి- సంపాదించండి) పథకం ప్రవేశపెట్టిందని తెలిపారు. దీనివల్ల యువత తగిన ఉపాధి సంపాదించడం, లేక స్వయం ఉపాధి పొందడం జరుగుతోందన్నారు. మొత్తం కేటాయింపుల్లో 33 శాతం మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. జాబితాలో లేని ఏజెన్సీలు ఈ ప్రాజెక్టును అమలుచేస్తాయన్నారు. ఈ పథకం ఆరంభం నుంచి 4.68 లక్షల మంది లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని, అందులో 2.28 లక్షల మందిని వివిధ రంగాలలో నియమించామని వివరించారు. సాధించిన లక్ష్యాల నిర్ధారణ తర్వాతే చివరి విడత ఏజెన్సీలకు ఇవ్వడం జరుగుతుందని, ప్రస్తుతం సీఖో ఔర్ కామో స్కీంను ప్రధాన మంత్రి విరసత్ కా సంవర్ధన్ సమగ్ర పథకంగా మార్చడం జరిగిందని వెల్లడించారు. దీని కింద మైనార్టీల నైపుణ్యాల అభివృద్ధి, వ్యవస్థాపకత, మహిళల నాయకత్వం, బడి మానేసిన పిల్లలకు విద్య కల్పించడంపై దృష్టి కేంద్రీకరించడం జరుగుతుందని కేంద్రమంత్రి స్మృతి ఇరానీ వివరించారు.

వైఎస్సార్ ఆసరా ఉత్సవాలు ప్రారంభం


ర్యాలీని ప్రారంభిస్తున్న మెప్మా సిబ్బంది

చీమకుర్తి: వైఎస్సార్ ఆసరా మూడో విడత ఉత్సవాలను చీమకుర్తిలో సోమవారం ప్రారంభించారు. మెప్మా ఆధ్వర్యంలో సభ్యులు బైకు ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది జెండా ఊపి ప్రారంభించారు. మెప్మా కార్యాలయం నుంచి చీమకుర్తిలోని మెయిన్‌రోడ్డు మీదుగా స్టేట్ బ్యాంక్ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షునిగా మద్దినేని


మద్దినేనిని అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చీమకుర్తి: కాంగ్రెస్ పార్టీ చీమకుర్తి మండల అధ్యక్షునిగా మద్దినేని వెంకటేశ్వర్లును నియమించినట్లు ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల సుబ్బారావు సోమవారం తెలిపారు. బాపట్ల పార్లమెంట్ నాయకుడి ఆధ్వర్యంలో మద్దినేనికి పార్టీ కండువా వేసి అభినందించినట్లు తుమ్మల తెలిపారు.

పదో తరగతి కీలకం


విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేస్తున్న మల్లికార్జునరావు, శివాజి

ఒంగోలు రూరల్: ఉన్నత విద్యకు, బంగారు భవిష్యత్తు పదో తరగతిలో సాధించే ఉత్తమ ఫలితాలు కీలకంగా మారతాయని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆర్‌వీఎస్ మల్లికార్జునరావు, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జి.శివాజి పేర్కొన్నారు. మండలంలోని కరవది జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం సుధారాణి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షల మెటీరియల్‌ను వారు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త పి.ప్రేమప్రమోద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటింటికి కుళాయిలు



మాట్లాడుతున్న ఆళ్ల రవీంద్రరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి సచివాలయ సిబ్బందికి సూచించారు. ఇంటింటికి కుళాయిలపై ఈతముక్కల సచివాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గాదెపాలెం, ఆలూరు, ఈతముక్కల, రాజుపాలెం, మడనూరు గ్రామాల్లో పైపులైన్లు వేస్తున్నారని, ఒకేసారి కుళాయిలు లాగించుకోవాలని సూచించారు. రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా కనక్షన్ ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమాదేవి, సర్పంచ్ మేడికొండ సునీత, పంచాయతీ కార్యదర్శి కిరణ్, మాకాని వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సిందు, తన్నీరు రాజేశ్వరి, రావుల భాగ్యలక్ష్మి, వి.నరసింహారెడ్డి, సుచరిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన నేతలు


సీఎం జగన్‌తో ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ అశోక్


మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కనకారావు మాదిగ, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య


మేదర కార్పొరేషన్ చైర్మన్ కేత లలిత నాంచారమ్మ, టైలర్స్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ షేక్ మస్తాన్ బీ, చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్


ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం టంగుటూరు మండలం కారుమంచి గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి స్వాగతం పలికారు. పలు విషయాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు.

- సాక్షి, ఒంగోలు


మద్దిపాడు ఏఎంసీ మాజీ చైర్మన్ ఇసగంటి పిచ్చిరెడ్డి

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు




కరవదిలో దేవస్థానాల వద్ద విద్యుత్ దీపాల అలంకరణ

ఒంగోలు రూరల్:

మండలంలోని కరవదిలో శ్రీరామనవమి 132వ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని శ్రీరామలింగేశ్వర, శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానాలు, సాయిబాబా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు ఉదయం , రాత్రి పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

ఒంగోలు నిర్మల్‌నగర్‌లో...

ఒంగోలు టౌన్: స్థానిక నిర్మల్‌నగర్‌లో శ్రీ సీతారామ స్వామి 30వ వసంత నవరాత్రుల కళ్యాణ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నిర్మల్‌నగర్, పరిసర కాలనీలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిర్మలా హైస్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. స్వాతిరామ్ నేతృత్వంలోని మనోన్మణి శిక్షణాలయం బృందం నృత్య ప్రదర్శన చేసింది. కార్యక్రమంలో నిర్మల్‌నగర్ కమిటీ గౌరవాధ్యక్షుడు తాటిపర్తి గోపాల్‌రెడ్డి, అధ్యక్షుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కార్యదర్శి నాగబోయిన భాస్కరరావు, కోశాధికారి మహదేవ ప్రసాద్, సభ్యులు మాధవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.


ఒంగోలు మంగమూరుడొంకలోని గాయత్రి మందిరంలో గాయత్రి అమ్మవారి హోమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు మరంపల్లి దక్షిణామూర్తి, ఉభయదాతలు, భక్తులు

నాగులుప్పలపాడులో సామాజిక తనిఖీ ప్రజావేదిక


ప్రజావేదికలో పాల్గొన్న పీడీ శీనారెడ్డి, ఎంపీపీ అంజమ్మ

నాగులుప్పలపాడు: మండలంలో 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికను సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. డ్వామా పీడీ శీనారెడ్డి పాల్గొని మాట్లాడుతూ అన్ని అంశాలను పరిశీలనలోకి తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల వారీగా జరిగిన పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించి గ్రామ సభలు నిర్వహించిందన్నారు. గ్రామాల వారీగా చదివిన నివేదికల ప్రకారం మొక్కల్లో తేడాలు, పనిపేరుతో బోర్డులు ఏర్పాటు చేయలేదని, హాజరు ముగిసిన తర్వాత పేర్లు చేర్చారని అన్నారు. కొన్నిచోట్ల పనికి సంబంధించిన రికార్డులు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. హాజరుపట్టీలను పరిశీలించారు. కాగా, ఎటువంటి రికవరీలకు సిఫార్సు చేయలేదు. కార్యక్రమంలో ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, ఎంపీడీవో ఏవీ కుమారి, డీఆర్పీలు కమలనాథ్, ఏసయ్య, ఎస్ఆర్‌పీ వెంకయ్య, ఏపీవోలు రవికుమార్, ధనుంజయ్‌వర్మ, జ్యోత్స్న, గ్రామాల సర్పంచ్‌లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఉత్తమం


రైతులతో మాట్లాడుతున్న రాధా శింగమనేని

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయం ఎంతో ఆరోగ్యకరమైనదని ఎల్–2 అధికారి రాధా శింగమనేని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో రైతు సాధికారిక సంస్థ మండలంలోని ఉలిచి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టి మంచి ఫలితాలు రాబట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాధా మాట్లాడుతూ రసాయనిక ఎరువులతో పండించే పంటల కన్నా ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలు మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. దిగుబడి అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉలిచి గ్రామ రైతులు, ప్రకృతి వ్యవసాయ రైతులు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతోనే నాటకానికి ఆదరణ


కళాకారులను సత్కరిస్తున్న ఐక్యవేదిక ప్రతినిధులు

ఒంగోలు టౌన్: నాటక రంగానికి ఆదరణ కోల్పోతున్న తరుణంలో ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో వస్తే తగిన ఆదరణ లభిస్తుందని వాకా సంజీవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఆవరణలో ప్రకాశం జిల్లా పౌరాణిక రంగస్థలం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నటరాజ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంజీవరెడ్డి మాట్లాడుతూ మనిషిని అత్యంత ప్రభావితం చేసే శక్తి కళారంగానికి ఉందన్నారు. ప్రస్తుతం ఉరుకులు, పరుగుల సమాజంలో నాటకాలను ఆదరించే వారు తగ్గిపోయారని, కళాకారులకు ఆదరణ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమాలు, సీరియల్స్ నాటక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయని చెప్పారు. అనంతరం నాటకరంగ ప్రముఖులైన పరాంకుశం కేశవాచార్యులు, తంగెళ్ల నాగభూషణం, రాయిపాటి ఆశీర్వాదం, పాలేటి బాబూరావు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో కుర్రా ప్రసాద్‌బాబు, మిడసల మల్లికార్జునరావు, కనకమాల రాఘవులు, తేళ్ల అరుణ, జి.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డాక్టర్ నూనె అంకమరావు, ధేనువకొండ సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే బిడ్డల ఎదుగుదల



కార్యక్రమంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం మాధవీలత

నాగులుప్పలపాడు: బాలింతలు, గర్భిణులు సరైన పోషకాహారం తీసుకుంటేనే బిడ్డల భవిష్యత్ బాగుంటుందని నాగులుప్పలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మాధవీలత తెలిపారు. పోషకాహార మాసోత్సవాల సందర్భంగా నాగులుప్పలపాడులో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారంతో ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శివనాగరాజ, వైద్యులు ఓనారియేల్, అంగన్‌వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు టౌన్: స్పందనలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కమిషనర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రణాళికకు సంబంధించి 4 ఫిర్యాదులు, పారిశుధ్య సమస్యపై 2, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 2 ఫిర్యాదులు వచ్చినట్లు వివరించారు. వాటిని సంబంధిత అధికారులకు పంపించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు కె.వెంకటేశ్వర్లు, కె.మాల్యాద్రి, మనోహరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఓపెన్ థియేటర్‌ను పునరుద్ధరించాలి


అమరులైన కళాకారులకు నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు టౌన్: శిథిలావస్థలో ఉన్న ఒంగోలు మున్సిపల్ ఓపెన్ థియేటర్‌ను పునరుద్ధరించాలని శ్రీవీరాంజనేయ నాట్యమండలి కార్యదర్శి మాక ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక నెల్లూరు బస్టాండ్ సెంటర్లోని మున్సిపల్ థియేటర్ ఆవరణలో పౌరణిక పద్య శిక్షణాలయాన్ని రంగభూమి కళాకారుల సంఘం అధ్యక్షుడు బేతంశెట్టి హరిబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పుట్టి పెరిగిన కళాకారులు ఎంతో మంది ఈ వేదిక మీద నటించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారని తెలిపారు. నాటక రంగంతో పాటుగా సినిమా రంగంలోనూ ప్రవేశించి అద్భుత నటనతో ప్రకాశం జిల్లా పేరు ప్రతిష్టలు చాటి చెప్పారని కొనియాడారు. జిల్లా సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కళాకారులు, సాహితీవేత్తలు అంగలకుర్తి ప్రసాద్, ధేనువకొండ సుబ్బయ్య, వాకా సంజీవరెడ్డి, మిడసల మల్లికార్జున, విశ్వరూపచారి, నాగార్జున, సీతయ్య, బాలగురవయ్య, లక్ష్మారెడ్డి, ద్వారా శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత ప్రముఖ నాటక కళాకారులు డీవీ సుబ్బారావు, బందారు రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలవరం ఎత్తు తగ్గింపు ఆలోచన విరమించుకోవాలి


నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్టుగా గుర్తింపు పొందిన పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర సమితి పిలుపు మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు ఎత్తును 150 అడుగుల నుంచి 135 అడుగులకు తగ్గించడం, 196 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యాన్ని 92 టీఎంసీలకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటించడాన్ని తప్పుపట్టారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తికి అవరోధం కలగడమే కాకుండా ప్రకాశం, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు నీటి సామర్థ్యం తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ జిల్లా కార్యదర్శి కె.వీరారెడ్డి, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలి


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న బాపట్ల కళాశాల విద్యార్థులు

అల్లూరు (కొత్తపట్నం): ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.రవిబాబు కోరారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా బాపట్లలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ కళాశాల చివరి సంవత్సరం విద్యార్థులతో అల్లూరు గ్రామంలో సోమవారం ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం-ప్రపంచాన్ని సంరక్షిద్దాం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ వలన మనుషులు, పశువులకు వచ్చే వ్యాధులు, సమస్యల గురించి వివరించారు. ప్లాస్టిక్ వలన కొన్ని సంవత్సరాలు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ రిప్రజెంటేటివ్ డాక్టర్ విజయ్‌కుమార్ సమక్షంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని పశువైద్య శిబిరం ఆవరణలో ఉన్న ప్లాస్టిక్ కాగితాలు, వ్యర్థాలను తొలగించారు. ఇంటి ముందున్న ప్లాస్టిక్ సంచులు, వ్యర్థాలను తొలగించుకుని పర్యావరణాన్ని కాపాడాలని గ్రామస్తులకు సూచించారు.

పశువులన్నింటికీ టీకాలు వేయించాలి


టీకాలు వేస్తున్న ఏడీ బసవశంకరరావు

ఒంగోలు రూరల్: జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా ఒంగోలు మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.బసవశంకరరావు తెలిపారు. త్రోవగుంటలోని పశువైద్యశాలలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పాడి రైతులు పశువైద్య సిబ్బందికి సహకరించి పశువులన్నింటికీ గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని ఏడీ కోరారు. ఒంగోలు మండలంలో మొత్తం 468 తెల్ల పశువులు, 8,837 నల్ల పశువులు ఉన్నాయని, ఇప్పటి వరకు 27 తెల్ల పశువులకు, 734 నల్ల పశువులకు టీకాలు వేశామని తెలిపారు.

వైఎస్సార్ సీపీ ప్రభ నిర్మాణానికి పూజలు


పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: మండలంలోని రామతీర్థం గంగమ్మ తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ తరఫున ఏర్పాటు చేయనున్న విద్యుత్ ప్రభ తడిక నిర్మాణానికి వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. ఏప్రిల్ 5వ తేదీ రామతీర్థంలో ప్రతిష్టాత్మకమైన రామతీర్థం గంగమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో ప్రభ తయారీకి పార్టీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, పార్టీ చీమకుర్తి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

భవిష్య నిధిపై అవగాహన అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఒంగోలు టౌన్: ఉద్యోగులు, కార్మికులు భవిష్య నిధి గురించి సరైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.అనితవాణి సూచించారు. స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని భగీరథ కెమికల్స్ లిమిటెడ్‌లో సోమవారం నిర్వహించిన నిధి ఆప్‌కే నికత్ సమావేశంలో ఆమె ప్రసంగించారు. ఇలాంటి సమావేశాల వలన కార్మికులకు కలిగే ఉపయోగాలను వివరించారు. కంపెనీ కార్మికులకు సంబంధించిన సమస్యలను అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భగీరథ మేనేజర్ కె.హరిబాబు, డీసీఎల్ శ్రీనివాసకుమార్, చౌదరి, ఎం.సమ్మయ్య, వెంకటరమణారెడ్డి, సాయికృష్ణ, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను లాభాల్లోకి తీసుకురావాలి

కె.పల్లెపాలెం (కొత్తపట్నం): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను లాభాల్లోకి తీసుకొస్తే గ్రామాలు పరిశుభ్రంగా ఉండటమే కాకుండా పంచాయతీలకు లాభం చేకూరుతుందని ఎంపీడీవో పి.సుజాత అన్నారు. కె.పల్లెపాలెంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికారులు ఇచ్చిన శిక్షణ తీసుకుని కేంద్రాలు నడుపుకోవాలని సూచించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని నడుపుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. తడి, పొడి చెత్త గురించి వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.